ప్రజాశక్తి

శనివారం 8 ఏప్రిల్ 2023 5

శ్రీ సత్యసాయి





జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి

- ఏమి చేసాడని 'మన భవిష్యత్'
- ఇంటి వద్దకు స్టిక్కర్లు తెచ్చేవారిని నిలదీయం
- యువగళంలో లోకేష్
- 800 కిలో మీటర్లకు పాదయాత్ర



యువగళం పాదయాత్రలో పాల్గొన్న మామా అల్లుళ్లు నందమూరి బాలకృష్ణ, నారా లోకేష్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అధోగతి పాలైందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. 63వ రోజు యువగళం పాదయాత్ర శుక్రవారం ఉదయం అనంతపురం జిల్లా శింగనమల నియోజకర్గం మర్తాడులో ప్రారంభం అయ్యింది. బూదేడు మీదుగా గార్లదిన్నె నుంచి రాత్రికి జంబులదిన్నెకి చేరుకుంది. శుక్రవారం నాటితో లోకేష్ పాదయాత్ర 800 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ శుక్రవారం జరిగిన పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈయనతో పాటు మాజీ హోం మంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప, కర్నూలు నాయకురాలు కోట్ల సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాదయాత్రలో 'గంజాయి వద్దు బ్రో' అన్న నినాదంతోనున్న క్యాప్‌ను తలకు ధరించి లోకేష్ పాల్గొన్నారు. మత్తు పదార్థాలు వినియోగించి యువత ఆరోగ్యాలు పాడుచేసుకుంటున్నారు... వీటని వాడొద్దంటూ తన ప్రసంగాల్లోనూ ప్రస్తావించారు. అనంతరం జరిగిన బహిరంగ సభల్లో వైసిపి చేపడుతున్న మూడు ప్రధాన కార్యక్రమాలపై లోకేష్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అన్ని రంగాల్లో వెనక్కు వెళ్లిందన్నారు. ఈ పరిస్థితుల్లో గొప్పలు చెప్పుకునేందుకు నువ్వే మా నమ్మకం జగన్ అంటూ ప్రజలను మోసం చేసే కార్యక్రమానికి వైసిపి నేతలు శ్రీకారం చుట్టారన్నారు. వాలంటీర్లు ఇళ్ల వద్దకు ఈ స్టిక్కర్లు తీసుకురాగాన రాష్ట్రానికి ఏమి చేశారని ప్రజలు నిలదీయాలన్నారు. తలుపునకు అతికించిన స్టిక్కర్లను పీకి వారికి వెనక్కు ఇవ్వాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని సొంత తల్లి, చెల్లియే నమ్మడం లేదని, ఇక ప్రజలు ఎలా నమ్ముతారన్నారు. 'నువ్వే భవిష్యత్' అంటూ మరో కార్యక్రమాన్ని వైసిపి చేపడుతోందన్నారు. రాష్ట్రాన్ని అధోగతిపాలు జేసిన వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఏ రకంగా మన భవిష్యత్ అవుతాడని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలి ప్రకటించిన లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే అతి తక్కువ ఐటి ఎగుమతులు చేస్తున్న రాష్ట్రమని చెప్పారు. వైసిపి చెపట్టిన మరో కార్యక్రమం 'జగన్‌కు చెబుదాం' అన్నది అని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డికి ఏమని చెప్పాలి... బాబాయి వివేకానందరెడ్డిని ఎవరు చంపారని చెప్పాలా... కోడికత్తి దాడి ఎవరు చేయించారో చెప్పాలా... అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి ఇప్పటికే భవయం పట్టుకుందని చెప్పారు. మొన్న జరిగిన నాలుగు మండలి ఎన్నికల్లోనూ ప్రజలు నాలుగు మొట్టికాయలు వేసారని చెప్పారు. ఆయన ఎన్నిక కార్యక్రమాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణి, టూమెన్ కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముట్టిమడుగు కేశవరెడ్డి, దండు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



యువగళం పాదయాత్రలో గంజాయి వద్దు బ్రో పోస్టర్లను విడుదల చేస్తున్న నారా లోకేష్

వివాదాల్లో 'పోలీస్'..!

- మడకశిరలో తరచూ విఆర్‌కు వెళ్తున్న పోలీస్ బాస్‌లు
- అవినీతి, ప్రయివేటు పంచాయితీలే కారణం..?

ప్రజాశక్తి-మడకశిర

కొందరు పోలీసులు చట్టం పరిధిని దాటి శాంతిభద్రతలకు తిలోదకాలిస్తూ, సొంత వ్యాపకాలతో ఇబ్బందులు కొని తెచ్చుకుంటున్నారు. మడకశిర ప్రాంతంలో ఇలా కొందరు పోలీసులు అవినీతి ఆరోపణల కేసులో విఆర్‌ఎలకు వెళ్తున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల్లో ఆరుగురు ఎస్‌ఐలు, సిఐలు ఇలా అవినీతి ఆరోపణలతో విఆర్‌కు వెళ్లారు. మడకశిర ప్రాంతం జిల్లాకు సుదూరంగా ఉండడంతో ఇక్కడ ఏ శాఖకైనా అధికారులైనా శిక్షకు గురై ఇక్కడికి బదిలీపై వస్తుంటారు. అలా వచ్చిన అధికారులు సైతం ఇక్కడికి రాగానే మళ్లీ అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం గమనార్హం. ముఖ్యంగా పోలీసు శాఖలో ఈ పరిస్థితి మరింత ఎక్కువ కన్పిస్తోంది. తాజాగా ఎస్‌ఐ నాగేంద్రుడు పలు ఆరోపణలుతో విఆర్‌కు వెళ్లారు. సదరు ఎస్‌ఐ విధుల్లో చేరిన తొలిరోజుల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గట్టిగానే ఆదేశాలు ఇచ్చారు. రోజుల గడిచే కొద్దీ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. మడకశిర, పరిసర ప్రాంతాల్లో మట్కా, పేకాట నిర్వహణ, కర్నాటక మద్యం విక్రయాలు కొనసాగాయి. సదరు పోలీసు అధికారికి తెలిసే ఇవన్నీ జరుగుతూ వచ్చాయనే విమర్శలు విన్పించాయి. పేకాట జూదరులను అరెస్టు చేసే సమయంలో సైతం దొరికన డబ్బును చూపకుండా ఎక్కువ మొత్తం జేబులో వేసుకుని, నామమాత్రపు డబ్బు రికవరీ చేసినట్లు తెలుస్తోంది. ఇది ప్రతి నిత్యం కొనసాగుతూ వచ్చింది. మడకశిర పట్టణం మీదుగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలకు వెళ్తున్న ప్రయివటు బస్సులు దాదాపు 40 వరకు ఉంటాయి. వీటిని ప్రతి నెలా పోలీసు శాఖ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటుక బట్టీల నిర్వాహకులతో సైతం ఏదో ఒక నెపంతో వారి నుంచి కూడా ప్రతి నెలా రూ.4 నుంచి రూ.10వేల వరకు వసూలు చేసినట్లు వినికిడి. ఇక భూ వివాదాల్లో అయితే ఆ స్థలం ధరను బట్టి పెద్ద మొత్తంలోనే తీసుకున్నట్లు సమాచారం. భార్యాభర్తలు, అన్నాదమ్ముల గొడవులు లాంటి వాటిలోనూ పోలీసులు తలదూర్చి ప్రయివేటు పంచాయతీలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల పరిగి నుంచి టిడిపి కార్యకర్తలను ఓ కేసు విషయంలో విచారణ నిమిత్తం మడకశిర పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. సాధారణ విచారణ నిమిత్తం తీసుకొచ్చిన వారి నుంచి కూడా భోజనాల ఖర్చు పేరుతో రూ.8 వేలు నొక్కేసినట్లు తెలుస్తోంది. సాధారణ విచారణ నిమిత్తం తీసుకొచ్చిన వారి నుంచి కూడా ఇలా డబ్బులు వసూలు చేసున్నారంటే, ఇక నేరాలకు పాల్పడినా, అనుమానితులుగా ఉన్నా వారిని తీసుకొచ్చిన స్టేషన్‌లో వసూళ్ల స్థాయి ఏ రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మడకశిర పోలీసు స్టేషన్‌లో కొందరు నిజాయితీగా పని చేయాలనుకున్న వారికి అవినీతి అధికారులు కావాలనే అడ్డంకులు సృష్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారనే వాదన అక్కడ పని చేసి వెళ్లిన వారు చెబుతుంటారు. ప్రజలకు చేరువగా ఉండీ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాల్సిన పోలీసులు ఇలా అవినీతి మరక వేసుకుని విఆర్‌కు వెళుతుండడంపై ప్రజల్లో ఆ శాఖపై రోజురోజుకు అభిమానం సన్నగిల్లుతోంది. ఇప్పటికైనా పోలీసులు అవినీతి మాటను పక్కన బెట్టి నికచ్చిగా విధులు నిర్వహించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని ప్రజలు కోరుతున్నారు.

14 నుంచి వామపక్షాల పాదయాత్ర

- కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన
- సిపిఎం, సిపిఐ నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలపై వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. శుక్రవారం పట్టణంలో సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్‌లు మాట్లాడుతూ బిజెపి కార్పొరేట్ మతోన్మాద విధానాలను ఎండగట్టేందుకు పాదయాత్రను నర్వహిస్తున్నట్లు చెప్పారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందన్నారు. అధిక ధరలు, నిరుద్యోగం, ప్రయివేటీకరణ సమస్యలతో జనం సతమతం అవుతున్నారని చెప్పారు. జీఎస్టీతో అధిక బారాలు వేస్తున్నారన్నారు. మతమార్పిడులు, మైనార్టీలు, దళితులపై దాడులు అధికం అయ్యాయన్నారు. రాఫెల్ ఆదానీల కుంభకోణాలతో దేశమంతా సమస్యలతో కొట్టుమిట్టాడు తోందన్నారు. ఏపీ రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న విద్రోహం, ప్రత్యేక హోదా విభజన హామీలు, విశాఖ ఉక్కు, పోలవరం, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాజధాని నిర్మాణం, వెనుకబడిన ప్రాంతానికి నిధులు ఇవ్వక పోవడంపై ప్రజలకు పాదయాత్రలో వివరిస్తామన్నారు. పోలవరం ఎత్తు తగ్గించాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలన్నారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న ద్రోహంపై రాష్ట్ర ప్రభుత్వం పల్లెత్తు మాట అనకపోవడం విచాకరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఒత్తిళ్లకు తలొగ్గి విద్యుత్ ఛార్జీల పెంపు, చెత్త పన్ను, ఆస్తి పన్ను, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టి ప్రజలపై భారాలు మోపుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ భారాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వీటన్నింటినీ 14 నుంచి 29 వరకు జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల్లో చేపట్టే పాదయాత్రలో ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. ప్రజలు, ప్రజాతంత్ర వాదులు పాదయాత్రకు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామకష్ణ, బ్యాల్ల అంజి, గంగాద్రి సిపిఐ, ఏఐఎస్ఎఫ్, నాయకులు ఆంజనేయులు, బయన్న పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమం కోసం అనుక్షణం కృషి

- ఇఫ్తార్ విందు ఇవ్వడం నా అదృష్టం
- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

హిందూపురం : ప్రతి నిత్యం తనకు అన్ని విధాలా తోడుగా ఉన్న ముస్లిముల సంక్షేమం కోసం అనుక్షణం కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని అల్ హిలాల్ ఫంక్షన్ హాల్‌లో బాలకృష్ణ ముస్లిములకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులకు అత్యంత పవిత్ర మాసం రంజాన్ అన్నారు. ఇలాంటి పవిత్ర మాసంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. హిందూపురం ఎమ్మెల్యేగా తనను రెండవ సారి గెలిపించడంలో ముస్లిం, మైనార్టీల అభిమానం ఎంతో ఉందన్నారు. కులమతాలకు అతీతంగా హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ముస్లింలు ఏర్పాటు చేసిన మైనార్టీ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు వారితో కలిసి విందును ఆరగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబికా లక్ష్మినారాయణ, జెఇ వెంకటస్వామి, నాగరాజు, అనిల్‌కుమార్, షఫీవుల్లా, తిమ్మయ్య, డిఇ రమేష్‌కుమార్, అమర్‌నాథ్, హిదయతుల్లా, సెల్ పాయింట్ నూరుల్లా, అన్వర్, ముస్లిములు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ముస్లిములకు భోజనాలు వడ్డిస్తున్న నందమూరి బాలకృష్ణ

విద్యార్థుల కరాటే విన్యాసాలు

కదిరి టౌన్ : కియో జపాన్ షాటోకాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటేబెల్ట్ ఎగ్జామినేషన్‌లో విద్యార్థులు చేసిన కరాటే విన్యాసాలు అబ్బురపరిచాయి. విద్యార్థులు చేసినటువంటి పంచెస్, కిక్స్, కథాస్, టైల్స్ బ్రేకింగ్స్, విత్‌ఔట్ బ్యాలెన్స్ స్టోన్ బ్రేకింగ్, అమ్మాయిలు ప్రత్యేకంగా చేసిన నాన్‌చాక్ రొటేషన్ విన్యాసాలు అబ్బురపరిచాయి. ఈ పోటీలలో 8 మంది బెల్ట్స్, ధ్రువీకరణ పత్రాలను సాధించారు విజయ్, భరత్, అభినవ్ ఎల్లో బెల్ట్ సాధించగా, సనత్, ఆరెంజ్ బెల్ట్ సాధించాడు. రామ్ చరణ్, నవాజ్, దీక్షిత్, శైలజ, బ్లూ బెల్స్ సాధించారు. వీరందరికీ కరాటే డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ అక్బర్ అలీ చేతులమీదుగా ధ్రువీకరణ పత్రాలు, బెల్ట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి మైనార్టీ నాయకులు ఆరిఫ్, కరాటే మాస్టర్ షాకీర్ హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు రమేష్‌నాయక్, రవికుమార్ తదితరులు మాట్లాడుతూ కరాటే శిక్షణ తమ పిల్లలకు ఎంతగానో ఉపయోగ పడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ వసుంధర పాల్గొన్నారు.

గర్భిణినికి రక్తదానం

ప్రజాశక్తి-హిందూపురం



రక్తదానం చేస్తున్న మహేష్

పట్టణంలోని ఓ ప్రవేటు అసుపత్రిలో కాన్పు కోసం కర్నాటక రాష్ట్రానికి చెందిన సుచిత్ర అనే గర్భిణి వచ్చింది. అయితే ఆమెకు రక్తం తక్కువ ఉందని వైద్యులు తెలిపారు. ఆమెది ఏ-నెగటీవ్ కావాడంతో గురువారం ఉదయం నుంచి చాల ప్రాంతాల్లో సంప్రదించారు. ఎక్కడా ఈ గ్రూపు రక్తం దొరకలేదు. చివరకు వారి బంధువులు గురువారం రాత్రి ప్రజాశక్తి విలేరితో విషయం చెప్పారు. వెంటనే ఈ విషయాన్ని ఆయన అల్ ఇందాద్ ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు అమన్‌కుయ వివరించి, సహాయం చేయాలని కోరారు. అమన్ వెంటనే స్పందించి వారి వద్ద ఉన్న రక్తదాతల వివరాలతో ఏ-నెగిటివ్ ఉన్న వారిని సంప్రదించారు. మహేష్ అనే వ్యక్తి జిల్లా అసుపత్రికి వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 25 సార్లు వివిధ ప్రాంతాలకు వెళ్లి రక్తదానం చేశానని చెప్పారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని ఆర్‌బిఐ ఆర్‌ఎల్‌ఎఫ్ సలహాదారులు శివ శంకర్ రెడ్డి, ఓంప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం మండల పరిధిలోని దేవరపల్లి వద్ద ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలు అందరూ బీమా తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల వరకు ప్రతినెలా ప్రీమియం చెల్లిస్తే 60 సంవత్సరాల తరువాత ప్రతి నెలా 3000 రూపాయలను కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ హనుమంతు రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు

రేషన్ సరుకులు కావాలంటే...


మూడు కిలోమీటర్లు వెళ్లాల్సిందే..!

ప్రజాశక్తి-నల్లమాడ

ప్రభుత్వం అందించే రేషన్ సరుకుల కోసం మూడు కిలోమీటర్లు దూరం నడవాల్సి ఉందని మండల పరిధిలోని రెడ్డికుంటతండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రేషన్ షాపులో గతంలో 150 కార్డులు ఉండేవని డీలర్ వెంకటేష్ నాయక్ తెలిపారు. ఇందులో 58 కార్డులను రెడ్డి కుంట తండా నుంచి మూడు కిలోమీటర్ల దూరంలోని తిప్పయ్యగారిపల్లి రేషన్ షాపునకు బదిలీ చేయడంతో సమస్య ఏర్పడిందన్నారు. ప్రతి నెలా మూడు కిలో మీటర్ల దూరం వెళ్లి రేషన్ సరుకులు తీసుకునేందుకు కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలోనే రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యపై తహశీల్దార్ దేవేంద్ర నాయక్ మాట్లాడుతూ రెడ్డికుంట తండా వాసుల సమస్యను గుర్తించామని, త్వరలోనే దీనికి పరిష్కారం చూపుతామని చెప్పారు.

ఆర్టీసీ ఉద్యోగుల సాయం

ప్రజాశక్తి-కదిరి టౌన్



సాయాన్ని అందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆర్టీటీ నిర్వహిస్తున్న 'స్పందించు సాయం అందించు' కార్యక్రమానికి కదిరి ఆర్టీసీ ఉద్యోగులు తమవంతు సాయం అందించారు. ఆర్టీటీ మొటుకుపల్లి డైరెక్టర్ శాంతమ్మ పిలుపు మేరకు ఉద్యోగులు సాయం అందించారు. రూ.5100 నగదును డిపో మేనేజరు బి.మైనోద్దీన్, అసిస్టెంట్ మేనేజరు హరిమోహన్‌లు అందజేసారు. ఇప్పటికి కదిరి ఆర్టీసీ ఉద్యోగులు నెల జీతంలో ఇండియా ఫర్ ఇండియాకు రూ.లక్ష రుపాయలపైబడి సాయం చేస్తున్నారు. రవాణా సేవలోనే కాకుండా ప్రజా సేవలో ఉద్యోగులు పాలుపంచుకోవడంపై డిపో మేనేజరు బి.మైనోద్దీన్ అభినందించాడు. ఈ కార్యక్రమంలో ఆర్టీటీ సిబ్బంది క్రిష్ణప్ప, తిమ్మయ్య, వెంకటనాయుడు, పురుషోత్తం రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది ఎన్‌వి.రమణ, అశ్వర్థమయ్య, బాలరాజు, బాలునాయక్, పాల్గొన్నారు.

విశ్వసనీయతను కోల్పోయిన టిడిపి

- మా నమ్మకం నువ్వే జగన్ అనేది ప్రజల నినాదాం
- ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెలీఇక్బాల్

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలో హిందూపురం నుంచి ఇచ్చాపురం వరకు ప్రజల విశ్వసనీయతను కోల్పోయిన పార్టీ టిడిపి అని హిందూపురం నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని ఆర్‌కె.ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా కుల, మత, ప్రాంతాలకు అతీతంగా నియోజకవర్గ వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అనేది ప్రజల నినాదాం అన్నారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు ఎస్సీ, ఎస్టీలను కించ పరుస్తూ అనేక సార్లు మాట్లాడారన్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ సైతం నియోజకవర్గంలో ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయారని చెప్పారు. టిడిపికి గత నాలుగు దశాబ్దాలుగా హిందూపురం నియోజకవర్గాన్ని అభివద్ధి చేయడానికి అవకాశాలు ఉన్నప్పటికీ కనీసం రోడ్ల విస్తరణ కూడా చేయలేదని దుయ్య బట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా హిందూపురం ప్రజల దాహార్తిని తీర్చడానికి కోసం పిఎబిఆర్ ద్వారా నీటిని తీసుకొచ్చారని చెప్పారు. టిడిపి నాయకులు కేవలం కమీషన్‌లకు కక్కుర్తి పడి జల కేటాయింపులు లేని గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకువచ్చారని ఆరోపించారు. టిడిపిపై విసిగిపోయిన జనం మా నమ్మకం నువ్వే జగన్ అంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ జబీవుల్లా, జడ్పీటీసీ నాగభూషణం, వైస్ ఎంపీపీ రామాంజి, కౌన్సిలర్లు జయప్ప, రోషన్ అలీ, నాగేంద్రబాబు, మల్లికార్జున, గిరీష్, ముస్తాక్, అయూబ్, చిన్నమ్మ, రేష్మా భాను, రహమత్‌బీ, బేవినహళ్లి సర్పంచి ఆనంద్, మార్కెట్ చాంద్ బాషా పాల్గొన్నారు.

కోర్టులో నూతన భవనాలు నిర్మించండి

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన డి.నాగరాజు శుక్రవారం నాడు ఎమ్మెల్యే శంకర్ నారాయణను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన నాగరాజు, ఇతర సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. పెనుకొండ కోర్టు వద్ద నెలకొన్న సమస్యలపై నాగరాజు ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లారు. కోర్టు ప్రాంగణంలో ఇప్పుడు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సబ్ కోర్టు నడుస్తున్నందున కోర్టు సిబ్బంది, న్యాయవాదులకు సరైన వసతులు లేవన్నారు. దీనికోసం నూతన భవనాలు నిర్మించాలని కోరారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వంతో చర్చించి అదనపు జిల్లా కోర్టు తీసుకురావడానికి తనవంతు కషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రెటరీ విక్రాంత్ నాయక్, న్యాయవాదులు శివశర్మ, శ్రీనివాసులు, నాగిరెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.నాగరాజు



మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి నాయకులు

'మా నమ్మకం నువ్వే జగన్' ప్రారంభం

ప్రజాశక్తి -పెనుకొండ

నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నాడు నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని 1వ వార్డు ఇస్లాపురం 2 వార్డు, 3 వార్డులు వెంకటరెడ్డి పల్లి, తిమ్మాపురం సచివాలయాల పరిధిలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫరూఖ్ ఖాన్, వైస్ ఛైర్మన్‌లు వైశాలి జయశంకర్ రెడ్డి, సునీల్‌లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు జగన్ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరారు. నవరత్నాల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఈ కార్యక్రమంలో 1వ వార్డ్ ఇన్‌ఛార్జి గోపాల్, 2వ వార్డ్ కౌన్సిలర్ శేషాద్రి, 3వ వార్డు ఇన్‌ఛార్జి వెంకటేశులు, వైసిపి నాయకులు తిమ్మారెడ్డి, సచివాలయ కన్వీనర్ రాము తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని చిన్నమంతూరు గ్రామానికి చెందిన నాగప్ప అనారోగ్యంతో శుక్రవారం మతి చెందాడు. ఈయన సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బికె.పార్థసారథికి బావమరది అవుతారు. నాగప్ప మృతి విషయం తెలుసుకున్న బికె చన్నమంతూరు గ్రామానికెళ్లి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, కన్వీనర్ నరహరి, తాడంగిపల్లి సర్పంచి మంజు, రామాంజనేయులు, ఎర్రిస్వామి, వెంకటేష్, రాము, శంకర్, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, రవి, పవన్, తిమ్మయ్య, లక్ష్మన్న, వెంకటరమణప్ప పాల్గొన్నారు.

స్పందించు సాయం అందించుకు రూ.10వేల సాయం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఆర్డీటీ చేపట్టిన 'స్పందించు సాయం అందించు' కార్యక్రమానికి ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ కోటి సుధ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం నాడు ఆర్డీటి సంస్థ వారికి ఈ సాయాన్ని అందజేశారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లల విద్యాభ్యాసం ఆర్డీటీ అందిస్తున్న సాయం వెలకట్టలేనదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ కోటి సుధ, ఆర్డీటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పరిసరాల పరిశుభ్రత ద్వారా స్వచ్ఛమైన ఆరోగ్యం చేకూరుతుందని రెడ్‌క్రాస్ ఛైర్మన్ జిఎం.శేఖర్ తెలిపారు. శుక్రవారం నాడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీ సత్యసాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో అక్షర జ్యోతి శిక్షణ కేంద్రంలో వలసదారులకు 60 హైజెనిక్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ జిఎం.శేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యం కోసం పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జిబి.విశ్వనాథ్ నేషనల్ ఖాదీ బోర్డ్ వైస్ ఛైర్మన్ చంద్రమౌళి, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్ సాయిదర్శిని, సురేష్, జగదీష్, శ్రీనివాసులు, కోఆర్డినేటర్ బి.రమేష్ పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ కుళ్లాయప్ప నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వివేకానంద రోడ్డులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సీజనల్ వ్యాధులు, వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల, వ్యాయామం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ నగేష్, ఎఎండి లక్ష్మినాయక్, వైద్య సిబ్బంది రమణయ్య, మంజుల దేవి పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మండల వైద్యాధికారి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మనోహర్ రెడ్డి, పర్యవేక్షకులు సుబ్బమ్మ, రవీంద్ర, నారాయణమ్మ, ఎల్టీ అనిల్ మధు బాబు ఫార్మసిస్ట్ సుబ్బలక్ష్మి, స్టాఫ్‌నర్స్ సుధా, సిబ్బంది సునీత, తిమ్మప్ప, ఆశాలు పాల్గొన్నారు.

ఆసుపత్రి సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా అసుపత్రిలో నెలకున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని చైతన్య సంస్థ అధ్యక్షులు గంగిరెడ్డి, కృష్ణా నాయక్‌తో పాటు స్థానికులు బాలకృష్ణకు వినతిని ఇచ్చి కోరారు. శుక్రవారం పట్టణంలోని నానేప్ప నగర్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న బాలకృష్ణకు స్థానికులు వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ విభాగంలో ఆపరేషన్ సమయం నందు ఎముకలకు డ్రిల్లింగ్ చేయడానికి మిషన్ లేకపోవడంతో ఆపరేషన్‌లు జరగడం లేదన్నారు. కోవిడ్ సమయంలో దాతలు ఇచ్చిన ఆరోగ్య పరికారాలతో పాటు ఇతర వాటిని వినియోగించడం లేదన్నారు. ఆక్సిజన్ కాన్సెంట్రేట్ వెంటిలేటర్స్ వాడుకలో లేవన్నారు. ఈ సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్వాక్రా సంఘాల్లో అవినీతి 'వెలుగు'

◆ యానిమేటర్ల ఇష్టారాజ్యం ◆ సంఘం డబ్బులు స్వాహా
◆ ఒక్క పీసీ గిరి గ్రామంలోని 13 లక్షల స్వాహా.?
◆ యానిమేటర్‌పై పోలీసు స్టేషన్‌లో మహిళల ఫిర్యాదు

ప్రజాశక్తి-గుడిబండ

వెలుగు సంఘాల్లో అవినీతి వెలుగు చూస్తోంది. మండల స్థాయిలో పనిచేస్తున్న అధికారుల పర్యవేక్షణ లోపంతో సంఘాల్లో వివోలుగా పనిచేస్తున్న యానిమేటర్లు ఇష్టారాజ్యంగా మహిళా సంఘాల్లోని డబ్బులను స్వాహా చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 1261 మహిళా సంఘాలు ఉన్నారు. వీటి పరిధిలో 61 మంది విఓలు ఉన్నారు. 61 మంది విఓలకు ఒక్కొక్క యామేటర్లను ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వం సంఘాలకు విడుదల చేస్తున్న డబ్బులను సంఘ సభ్యులకు చేరవేయడానికి యానిమేటర్లకు బాధ్యతలు అప్పగించింది. ఇదే అదునుగా చేసుకున్న పలువురు యానిమేటర్లు మహిళా సంఘంలో మహిళల అమాయకత్వాన్ని ఆసర చేసుకుని వారికి తెలియకుండా ఇష్టారాజ్యంగా లక్షలాది రూపాయలను స్వాహా చేస్తున్నారు. గుడిబండ మండల పరిధిలోని పిసి.గిరి గ్రామంలో 14 మహిళా సంఘాలు కల్పన సంఘం పేరుతో గ్రామ సమాఖ్య సంఘంగా ఏర్పడింది. ఈ సంఘాలకు ఆ గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తిని ప్రభుత్వం విఒ ఆనిమేటరుగా పని చేస్తున్నారు. సంఘాల లావాదేవీలకు పుస్తకాలు రాస్తూ పలు సంఘాల్లో మహిళలకు తెలియకుండా ఈయన దాదాపు రూ.13 లక్షల వరకు డబ్బులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది.

పోలీసులకు ఫిర్యాదు

పిసి.గిరి గ్రామంలో యానిమటర్ డబ్బులు కాజేసిన విషయాన్ని ఆలస్యంగా కనుగొన్న మహిళలు తమకు న్యాయం చేయాలంటూ రాతపూర్వకంగా గుడిబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వెలుగు సంఘంలో పనిచేస్తున్న మండల స్థాయి అధికారుల దష్టికి గతంలోనూ మహిళలు తీసుకెళ్లారు. దీనిపై విచారణ జరిగ్గా యానిమేటర్ సురేష్ అవినీతికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అవినీతి బహిర్గతం అయినా విచారణ జరిపిన అధికారులు అతనిపై ఎలాంటి చర్యలూ ఇప్పటి వరకు తీసుకోలేదు. దీంతో మహిళలు పోలీసులను ఆశ్రయించారు.

మిగితా గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి...

ఈ ఒక్క పంచాయతీ కాకుండా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ మహిళా సంఘాల డబ్బు స్వాహా అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో



కూడా రాళ్లపల్లి పంచాయతీలో వెలుగు సంఘంలో సిసిగా పనిచేస్తున్న అధికారి మదిగుబ్బ గ్రామంలో సంఘ సభ్యుల డబ్బులను దాదాపు రూ.6లక్షలు స్వాహా చేసినట్లు ఆరోపణలు వ్యక్తం అయ్యాయి. సదరు అధికారి వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో ఆ మహిళలు గుడిబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఆ అధికారి నుంచి ఆరు లక్షల రూపాయలను రికవరీ చేసి మహిళా సంఘం సభ్యులకు వెనక్కు ఇప్పించారు. ఇలా మండలంలో మహిళా సంఘం సభ్యులు కొందరు అక్రమంగా కాజేస్తున్నారు. దీనిప సంబంధిత ఉన్నతాధి కారులు స్పందించి మండల వ్యాప్తంగా నడుస్తున్న సంఘాలపై . ప్రత్యేక దష్టి ఉంచి ఇలాంటి స్వాహా పర్వం పునరావత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని మహిళా సంఘం సభ్యులు వేడుకుంటున్నారు.

జగన్మోహన్‌రెడ్డి అన్ని హామీలనూ నెరవేర్చారు.. : ఇక్బాల్

ప్రజాశక్తి-హిందూపురం

పాదయాత్ర, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. శుక్రవారం నాడు రూరల్ మండలం చెలివెందుల గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్సీకి అడుగుఅడుగునా హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ఎమ్మెల్సీ వెళ్లి చంద్రబాబు ఇచ్చిన అపద్దపు హామిలను వివరిస్తు, జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చిన విధానం గురించి వివరించారు. ప్రతి ఇంటికీ పార్టీ స్టిక్కర్‌లను అంటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్ర రెడ్డి, వైస్ ఎంపీపీ రఘునాథరెడ్డి, ఇన్‌ఛార్జి సర్పంచి ప్రతాప్ రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు లోకేష్ వాల్మీకి, పురుషోత్తం రెడ్డి, నరేష్ గౌడ్, సంతేబిదనూర్ రాము, ఏకాసప్ప, వినోద్ వాల్మీకి, బాబుల్లి, రమణ, రామ్ చరణ్, పాల్గొన్నారు.

ఇంటి వద్దనే సమస్యల పరిష్కారం : సిద్ధారెడ్డి

కదిరి అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు అమీన్‌నగర్‌లో ఎమ్మెల్యే డా॥పివి.సిద్ధారెడ్డి శుక్రవారం నాడు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి గత ప్రభుత్వానికి, వైసిపి పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలకు



చెలివెందుల గ్రామంలో ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్సీ

వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకుని వాటిని అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 82960 82960 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి మిస్డ్‌కాల్ ఇవ్వాలని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మాజీ సమన్వయకర్త ఎస్ఎండి ఇస్మాయిల్, నాయకులు సాధిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల పరిధిలోని కె.పూలకుంట గ్రామంలో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎంపిటీసీ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గహ సారథి గౌరమ్మ, గ్రామ వాలంటీర్లు శంకర, షబానా, చెక్క పారేసు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన అందిస్తున్నాం.. : శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ : ల అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను



కదిరిలో స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

అందిస్తూ రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలియజేశారు. శుక్రవారం మండల పరిధిలోని రెడ్డిపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం నిర్ధేశించిన ఐదు ప్రశ్నలకు ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి నుంచి ప్రభుత్వం కేటాయించిన టోల్‌ఫ్రీ నెంబర్‌కు మిస్డ్‌కాల్ చేయించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కుల్లాయినాయక్, ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, సర్పంచులు ప్రసాద్, ప్రతాప్ రెడ్డి, రమణారెడ్డి, రజిని కుమార్‌రెడ్డి, మండల అగ్రి బోర్డు ఛైర్మన్ రఘునాథరెడ్డి, నల్లమడ సొసైటీ అధ్యక్షులు అంకిరెడ్డి గంగిరెడ్డి పాల్గొన్నారు.

బాగేపల్లి న్యూస్..



సిపిఎం బాగేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి డా॥అనిల్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

కొత్తకోటలో సిపిఎం ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి-చిలమత్తూరు

కర్నాటక శాసనసభ ఎన్నికల్లో భాగంగా బాగేపల్లి తాలుకా గూళూరు హోబ్లీ పరిధిలోని కొత్తకోట పంచాయతీలో సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ గెలుపును కోరుతూ శుక్రవారం ప్రచారం ముమ్మరంగా సాగింది. ప్రచారం ముందు భాగాన నడిచే కళాజాత ప్రజలను ఆకట్టుకుంటుంది. సిపిఎం తాలుక శాఖ నాయకత్వంతో పాటు హోబ్లీ, కొత్తకోట పంచాయతీ మొదటి, ద్వితీయ శ్రేణి నాయకులతో కలిసి ఆయ గ్రామ కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు. 'ఇంటింటికీ సిపిఎం జనం కోసం సిపిఎం' అనే నినాదంతో సిపిఎం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా స్వయాన అభ్యర్థి ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. గతంలో ఈ నియోజకవర్గంలో సిపిఎం అధికారం ఉన్నప్పుడు చేసిన అభివద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తూ ఓటును అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో సిపిఎం పార్టీ తాలుక కార్యదర్శి రఘురాంరెడ్డి, గూళూరు సమితి కార్యదర్శి వెంకటరాం, మాజీ జిల్లా పంచాయతీ సదస్సురు శ్రీరామప్ప, డిసి శ్రీనివాసులు, ఓబుళరాజు, చలపతి, సంపత్ రెడ్డి, సురేష్, రామంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసేందుకే పాదయాత్ర

ఆసరా వారోత్సవాల్లో ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయకుండా ఇప్పుడు మరోసారి అధికారం ఇవ్వండి అంటూ ప్రజలను మోసం చేసేందుకు నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమందేపల్లి మండలంలో సుమారు 756 సంఘాల లబ్ధిదారులకు రూ.5.94 కోట్ల రూపాయలను మూడో విడత ద్వారా అందించినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాం చంద్రబాబు నాయుడు 600 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. ఇప్పుడు తన ఉనికిని చాటుకోవడానికి కుమారుడు లోకేష్‌తో పాదయాత్ర చేయిస్తున్నారని మండిపడ్డారు. వీరికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగాదేవి నరసింహామూర్తి, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, కన్వీనర్ నారాయణరెడ్డి, జెడ్పీటీటీ డిసి.అశోక్‌తో పాటు మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు,వైసీపీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన బాలయ్య

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని నానేప్ప నగర్‌లో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధ నీటి జల కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి ప్రభుత్వం సమయంలో ఆనాదిగా హిందూపురంలో ఉన్న నీటి సమస్యను పరిష్కరించామన్నారు. ప్రస్తుత వేసవి సమయంలో రోటరీ క్లబ్ వారు ప్రజల దాహార్తి తీర్చేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.

లోకేష్, బాలయ్యను సన్మానించిన పురం నాయకులు

అనంతపురం జిల్లా శింగనమలలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురం టిడిపి, బాలయ్య అభిమానులు పెద్ద ఎత్తున పాల్గోన్నారు. ఈ సందర్భంగా లోకేష్, బాలయ్యను వారు ఘనంగా సన్మానించారు.



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మానవాళిని రక్షించి అందరూ సుఖంగా ఉండాలని ఆకాంక్షించే పండగే గుడ్‌ఫ్రైడే అని పాస్టర్ అరుణ్ కుమార్ పేర్కొన్నారు. పుట్టపర్తి మండల పరిధిలోని కర్నాటక నాగేపల్లి గ్రామంలో కింగ్స్ చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ అరుణకుమార్, సులోమి బైబిల్‌లోని బోధనలను వివరించారు. అనంతరం చర్చి సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న టిడిపి శ్రేణులు

మడకశిర అభివృద్ధికి 'గుండుమల' ప్రత్యేక కృషి

ప్రజాశక్తి - మడకశిర

గత టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రత్యేక నిధులు తెప్పించి మడకశిర నియోజకవర్గం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్సీ గండుమల తిప్పేస్వామి విశేష కృషి చేశారని టిడిపి నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి జన్మదిన వేడుకలను శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. భారీ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకరవర్గంలోని ఐదు మండలాలకు చెందిన టిడిపి అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి రాధాకష్ణలు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో రూ.800 కోట్లతో కొడికొండ-సిరా జాతీయ రహదారి మంజూరు చేయించారన్నారు. వ్యవసాయ రంగానికి హెచ్‌విడిఎస్‌తో నాణ్యమైన విద్యుత్ వ్యవస్థ సబ్ స్టేషన్ నిర్మాణం టిడిపి హాయాంలోనే జరిగిందన్నారు. రూ.120 కోట్లతో గుడిబండ, గుండుమల, రోళ్లలో బీసీ ఎస్సీ బాలురు, బాలికలకు ప్రత్యేకంగా గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేశారని చెప్పారు. రూ.40 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా కష్ణ జలాలను మడకశిరకు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గుండుమల చంద్రప్ప, గుండుమల జయప్ప, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు భక్తర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పుల్లయ్య చౌదరి, రిటైర్డ్ అధికారి మల్లికార్జున, బెగర్లపల్లి రవి, డాక్టర్ కష్ణమూర్తి, కళ్లుమరి సర్పంచ్ గంగమ్మ నాగరాజు, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

గుండుమలకు నారా చంద్రబాబు నాయుడు, లోకేష్ శుభాకాంక్షలు

టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ట్విట్టర్లో గుండుమల తిప్పేస్వామికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గుండుమల తిప్పేస్వామికు శుభాకాంక్షలు

గుడిబండ : మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి జన్మదినోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ మద్దనకుంటప్ప ఆధ్వర్యంలో బస్టాండ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేశారు. కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి. తెలుగు యువత అధ్యక్షులు దుర్గేష్, న్యాయవాది శివకుమార్, రవిస్వామి, సత్యసాయి జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు మంజునాథ్, నాయకులు బూదిపల్లి జయరాం, శంకరగుల్లు సర్పంచి నరేంద్ర, రాళ్లపల్లి మాజీ సర్పంచి లక్ష్మీనారాయణప్ప, మాజీ మండల ఉపాధ్యక్షులు రాజన్న, నాయకులు పురుషోత్తం, రామాంజి, మాజీ ఎంపిటిసి భోజరాజు, క్రిష్టప్ప పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కారు- ద్విచక్రవాహనం ఢీ

ఇద్దరు మృతి



మృతి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-నల్లచెరువు

శ్రీ సత్యసాయి జిల్లా నల్లచెరువు మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తనకల్లు మండలం కనసానివారిపల్లికి చెందిన చంద్రశేఖరరెడ్డి(45), శ్రీనివాసరెడ్డి(35)అనే వ్యక్తులు ఓ పని నిమిత్తం ద్విచక్రవాహనంలో కదిరికి బయల్దేరారు. కదిరికి వెళ్తుండగా మార్గమధ్యంలో నల్లచెరువు మండలం ఎర్రగుంటపల్లి వద్దకు రాగానే ముందు వెళ్తున్న బొలేరోజు ఓవర్‌టేక్ చేశారు. ఈ సమయంలో ఎదురుగా మదనపల్లి వైపు వెళ్తున్న కారు రావడంతో దానిని ఢీకొన్నారు. రెండు వాహనాలు వేగంగా ఎదురెదురుగా ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే ద్విచక్రవాహనంలో వెళ్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి మృతి చెందారు. ప్రమాదవిషయం తెలుసుకున్న కదిరి రూరల్ సిఐ శివశంకర్ నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కదిరికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

'అనంత'లో భారీ పేలుడు

తునాతునకలైన వ్యక్తి శరీర భాగాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన భారీ పేలుడు కలకలం రేపింది. రవాణా శాఖ కార్యాలయం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో చాకలి సతీష్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కెకె.అపార్టుమెంట్స్‌లో సతీష్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అపార్టుమెంటు యజమానులకు కెకె.పెయింటింగ్స్ అనే పెయింటింగు వ్యాపారమూ ఉంది. పెయింటింగుకు సంబంధించిన మెటీరియల్, ఇతర రసాయనాలు డ్రమ్ముల్లో చాలాకాలంగా నిలువ ఉన్నాయి. రసాయనాలు పడేసి డ్రమ్ములను గుజరీకి అమ్ముకోమని యజమానులు చెప్పడంతో, అందులోనున్న రసాయనాలు కిందపడేసేందుకు మూతలు తెరిచారు. ఆ సమయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి సతీష్ 40 అడుగుల ఎత్తు ఎగిరి కిందపడ్డాడు. శరీర భాగాలు మొత్తం తునాతునకలై మాంసం ముద్దలాగా మారింది. మధ్యాహ్నం సమయంలో ఇంత పెద్దఎత్తున పేలుడు సంభవించడంతో ఏమి జరిగిందోనని ఆ ప్రాంతంలో భీతావాహ వాతావరణం ఏర్పడింది. ఘటన విషయం తెలియగానే వన్‌టౌన్ పోలీసులు, ఫైర్ సిబ్బందికి కూడా అక్కడికి చేరుకున్నారు. సిఐ రవిశంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

జబ్బులపై అవగాహన కలిగుండాలి

కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.నరసింహులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



డా॥నరసింహులు

ప్రజలందరూ జబ్బులపై అవగాహన కలిగి ఉండి, ఎప్పటికప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ, కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీలో మధు కంటి వైద్యశాలలో ప్రపంచ ఆరోగ్య వజ్రోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహులు పలు విషయాలను ప్రజలకు తెలియజేశారు. ప్రజల ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందన్నారు. అనారోగ్యంగా ఉన్నప్పుడే ముందుగా గుర్తించి, వైద్యుల సలహాలతో వైద్య చికిత్సలను పొందాలన్నారు. సమతుల్యమైన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. మంచి ఆరోగ్యానికి నడవడిక ఎంతో ముఖ్యమని తెలిపారు. దురాలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. వైద్యులను సంప్రదించకుండా సొంత వైద్యం చేసుకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని వారు తెలిపారు.

భూముల వేలాన్ని అడ్డుకుంటాం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

తలుపుల మండలం వేపమాని పేట గ్రామంలోని ఓబులేశ్వర స్వామి మాన్యం భూముల బహిరంగ వేలాన్ని అడ్డుకుంటామని ఎమ్మార్పీఎస్ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం నాయకులు దబ్బల శ్రీరాములు, బేకరీ గంగాధర్, ఎస్టీడీ నరసింహులు, ఫొటో సాయి, రామయ్య తదితరులు ఓ ప్రకటన విడుదల చేశారు. మాన్యం భూములను 22 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ వివాదం రాష్ట్ర హైకోర్టులో ఉందన్నారు. ప్రత్యామ్నాయంగా దళితులకు భూములు చూపించిన తరువాతనే వేలం వేయాలని కోర్టు సూచించినప్పటికీ ఆ ఉత్తర్వులను లెక్కచేయకుండా దేవాదాయ అధికారులు పదేపదే భూముల వేలానికి రావడం కోర్టు ధిక్కరనే అవుతుందన్నారు. ఈనెల 11న వేయనున్న వేలాన్ని అడ్డుకుంటామని చెప్పారు. 45 మంది మాదిగ మహిళలకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని పేర్కొన్నారు.

ఆసుపత్రికెళ్లి పింఛన్ అందజేత

ప్రజాశక్తి-నల్లమాడ

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నడవలేని స్థితిలో ఉన్న ఓ వ్యక్తికి మండల పరిధిలోని కొత్తపల్లి తండాకు చెందిన వాలంటీర్ చెన్నమ్మబాయి అనంతపురం వెళ్లి సామాజిక పింఛన్‌ను శుక్రవారం అందించింది. తండాకు చెందిన వద్దుడు గోపేనాయక్, కేస్లీబాయ్‌లు అనారోగ్య సమస్యలతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకుంటున్నారు. గ్రామంలో వీరు పింఛన్ తీసుకునేందుకు వీలుకాకపోవడంతో వాలంటీర్ చెన్నమ్మబాయి అసుపత్రికి వెళ్లి పింఛన్ అందించారని వేళ్లమద్ది సర్పంచి బొజ్జే నాయక్, గిరిబాబు నాయక్ తెలిపారు.



ఆసుపత్రిలో పింఛన్ అందిస్తున్న వాలంటీర్ చెన్నమ్మబాయి

హామీలను నిలుపుకున్న ముఖ్యమంత్రి



స్టిక్కర్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపిపి

బత్తలపల్లి : గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అని జెడ్పీటీసీ కోటి సుధ, ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బత్తలపల్లి, యర్రాయపల్లి, సంజీవపురం ఈదుల ముష్టూరు, లింగారెడ్డిపల్లి, పోట్లమర్రి, గుమ్మల్లకుంట, అప్పరాచెరువు గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇంత పెద్ద ఎత్తున ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బయపరెడ్డి, సచివాలయాల కన్వీనర్ జయరామిరెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, రాంభూపాలిరెడ్డి, వీరనారప్ప, ఈశ్వరయ్య పాల్గొన్నారు.